

# ‘అసాంఘిక శక్తుల’ పేరిట రూపొందిస్తున్న కొత్త నిర్బంధ చట్టాన్ని వ్యతిరేకిద్దాం

**టా**డాను కొత్త కొత్త రూపాలలో తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలు మన పాలకులు చేస్తూనే ఉన్నారు.

టాడాను ఉన్నదున్నట్టుగా తిరిగి తీసుకొచ్చే ప్రయత్నం కేంద్రప్రభుత్వం కొంతకాలంగా చేస్తున్న సంగతి తెలిసిందే. టెర్రరిస్టు చర్యల నిరోధక చట్టం (‘పోటా’) అన్న పేరున్న ఈ బిల్లు ఏ రోజైనా చట్టం కాగలదు.

అదట్లా ఉండగానే, మన రాష్ట్ర ప్రభుత్వం అసాంఘిక చర్యలను అరికట్టడానికి కొత్త చట్టమొకటి తీసుకొచ్చే ప్రయత్నం చేపట్టింది. టాడాలోని అంశాలు సగంపైగా అందులో ఉన్నాయి.

చేసే ప్రయత్నం తప్పొప్పుల సంగతి అటుంచి, ఏ పనీ కూడా పారదర్శకంగా చేయకపోవడం మన పాలకుల అలవాటు. అందువల్ల ఈ కొత్త చట్టం గురించి స్పష్టమైన సమాచారమేదీ ప్రజలకు తెలియదు. దానికి ఇప్పటికే తుదిరూపం ఇచ్చి రాష్ట్రపతి ఆమోదం కోసం ఢిల్లీకి పంపించారని ఒక వార్త, తుదిరూపం ఇవ్వడం కోసం ప్రతిపక్ష పార్టీలతో ఇంకా చర్చించనున్నారని ఇంకొకవార్త, పత్రికలలో వచ్చాయి. వీటిలో ఒకటి నిజమని, ఇంకొకటి నిజం కాదని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా స్పష్టం చేయలేదు. చేయడం వారి నైజం కాదు. గుడ్డివాళ్లు ఏనుగు స్వరూపాన్ని ఊహించుకున్నట్టు ప్రజలు ఆ చట్టాన్ని గురించి చర్చించుకోవాలే తప్ప, ఒక ప్రజాస్వామ్యంలో పౌరులకుండవలసిన కనీస సమాచారహక్కుకు ఇక్కడ చోటు లేదు. దాని పట్ల పాలకులకు గౌరవం లేదు.

ప్రతిపాదిత చట్టంలోని ‘ప్రధాన అంశాలు’ అనే ఊరూపేరూ లేని పత్రమొకటి మాత్రం హైదరాబాద్‌లో పత్రికల కార్యాలయాలకూ ప్రతిపక్ష పార్టీల కచేరీలకూ చేరింది. ప్రభుత్వం ఉద్దేశ్యం ఆ పత్రంలో చూచాయగా కనిపిస్తుంది.

నేర చట్టానికి దుర్మార్గమైన రూపం ఇవ్వాలని ఎప్పుడు సంకల్పించినా దుర్మార్గమైన నేరాలను దానికి కారణంగా చూపించడం మన ప్రభుత్వాల అలవాటు. ఇది తప్పుడు తర్కమని ప్రజలు గుర్తించలేనంతకాలం నేర చట్టంతో చెలగాటమాడడం వారికి చాలా సులభం. దుర్మార్గమైన నేరాలను అదుపు చేయడానికని చెప్పి దుర్మార్గమైన చట్టాలు చేస్తే ఆ దుర్మార్గానికి అమాయకులు బలి అయ్యే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. అమాయకులపైన కావాలని ప్రయోగించే ప్రమాదమూ ఉంటుంది.

భూమి కబ్జాలనూ బలవంతపు డబ్బుల వసూళ్లనూ గంజాయి వ్యాపారాన్నీ మాఫియా వ్యవహారాలనూ అరికట్టడం కోసమే ఈ కొత్తచట్టం అని ప్రభుత్వం అంటుంది. ఈ నేరాలను అరికట్టడం మంచిపని అనే ప్రజలలో చాలామంది భావిస్తారు కాబట్టి ఇంక ఆ చట్టం స్వరూపాన్ని గురించి వారు ఆలోచించరని భావిస్తుంది.

తమ ఆలోచనలను ప్రభుత్వానికి తాకట్టు పెట్టే ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేరు కాబట్టి ఈ నేరాల పేరు చెప్పి ప్రభుత్వం ఏం చేస్తున్నదో కొంచెం పరిశీలిద్దాం.

## ఈ చట్టంలో ఏముంది?

నేరచట్టంలో ముద్దాయికి అనేక హక్కులు, సహజ న్యాయసూత్రాల రక్షణ ఉంటాయి. ఇవి ఉండడానికి కారణం చట్టానికి నేరస్తులంటే ప్రేమ ఉందని కాదు. నేర విచారణకు నిర్దోషులు బలికాకూడదన్న నాగరికమైన ఆలోచన దానికి మూలం. ఈ హక్కుల పట్ల, సహజ న్యాయసూత్రాలపట్ల పోలీసు యంత్రాంగానికీ పోలీసు మనసున్న పాలకులకూ ఎప్పటి నుండో చాలా వ్యతిరేకత ఉంది. దోషికి శిక్షపడుతుందా లేక నిర్దోషికి శిక్షపడుతుందా అన్న ఆందోళన చేతకాని న్యాయవ్యవస్థ చాదస్తమనీ, చకచకా కేసులు ‘విచారించేసి’ శరవేగంగా

అనుమానితులను జైళ్లకు పంపినట్టయితేనే 'శాంతిభద్రతలు' పదిలంగా ఉంటాయనీ వారి విశ్వాసం.

అందుకే నాగరిక నేర చట్టాలలోని సహజన్యాయసూత్రాలను నీరుగార్చాలని పోలీసుబుద్ధి ఉన్న పాలకులు పదేపదే ప్రయత్నం చేస్తుంటారు. నేరాలను చకచకా 'విచారించి' శాంతిభద్రతలను దృఢంగా స్థాపించాలన్న ఆరాటమేకాక వారికి వేరొక ప్రయోజనం కూడా ఉంది. నేర విచారణ వ్యవస్థ ప్రయోగించే నిర్బంధం చట్టబద్ధమైనది కాబట్టి దాని నుండి తప్పించుకోవడం పౌరులకు కష్టం. దానిని భ్రష్టు పట్టించి తను రాజకీయ ప్రత్యర్థులపైన, ప్రస్తుత సమాజంలో అసమ్మతివాదులయిన వారిపైన ప్రయోగించినట్టయితే చాలా చట్టబద్ధంగానే వారిని అణచివేయవచ్చు.

ఈ రకమైన ఆలోచనాధోరణి ఉన్న పాలకులు కోరుకునే సవరణలు ప్రధానంగా అయిదు రకాలు. నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయిలపైనే పెట్టాలి, పోలీసు కస్టడీలో ముద్దాయి చేత నేరం ఒప్పించేస్తే ఆ ఒప్పుకోలును కోర్టు సాక్ష్యంగా స్వీకరించాలి, నేర విచారణ బహిరంగంగా కాకుండా రహస్యంగా జరగాలి, ముద్దాయికి తన మీద ఉన్న అభియో[illegible] సంపూర్ణంగా తెలియచేయాలన్న పారదర్శక సూత్రాన్ని తొలగించాలి, నేర విచారణ ముగిసే వరకు ముద్దాయికి బెయిలు ఇవ్వకుండా చేయాలి.

నేర విచారణను ఈ విధంగా తయారు చేసినట్టయితే కేసులు త్వరత్వరగా 'పరిష్కారమయి' పోవచ్చునేమోగానీ ఆ పరిష్కారంలో న్యాయమెంత అన్యాయమెంత అని చెప్పగలవారెవ్వరూ ఉండరు. ఎంతమంది నిర్దోషులు ఎన్ని సంవత్సరాలు ఊచలు లెక్కబెడతారో చెప్పగలవారూ ఉండరు.

టాడాలో పై లక్షణాలయిదూ ఉన్నాయి. టెర్రరిస్టు చర్యల పట్ల సాధారణ ప్రజలలో ఉన్న వ్యతిరేకతను ఆసరా చేసుకొని ఈ అనాగరిక లక్షణాలను నేరచట్టంలోకి దిగుమతి చేశారు.

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదిస్తున్న చట్టంలో మొదటిది తప్ప మిగిలిన నాలుగూ ఉన్నాయి. అది రేపు చట్టమయితే దాని వేటు ఎవరెవరి మీద పడనుందో!

## దీనిని ఎవరి మీద ప్రయోగించబోతారు?

పేదల భూములు బలవంతంగా కబ్జా చేసుకునే దుండగులు, బాంబులూ తుపాకులూ చూపించి పట్టపగలే బలవంతంగా చందాలు వసూలు చేసే దుండగులు మన సమాజంలో లేకపోలేదు. వారి పట్ల ప్రజలలో అసహ్యమూ లేకపోలేదు. కానీ వారిని అరికట్టడానికి కొత్త చట్టాలు అక్కరలేదు. నిజాయితీతో కూడిన రాజకీయ సంకల్పం ఉంటే చాలును. ఎందుకంటే ఈ అసాంఘిక శక్తులు అత్యధికంగా తెలుగుదేశం, కాంగ్రెస్ వంటి పార్టీలకు చెందినవారే. వారిలో కొందరు స్వయంగా ప్రజాప్రతినిధులు కాగా తక్కినవారు ప్రజాప్రతినిధుల కుడిభుజాలు. వారికి రాజకీయ రక్షణ లేకపోయినట్టయితే వారి ఆగడాలను మామూలు చట్టాలే ఆపగలవు. లేదా ప్రజలే వారికి జవాబు చెప్పగలరు. ఆ నిజాయితీ లేని పాలకులు నేరచట్టాన్ని దిగజార్చి మధ్యయుగాల నమూనాలో తిరగరాయడాన్ని మనమెందుకు ఆమోదించాలి?

'భూమికబ్జా' అనేది రెండంచుల కత్తి. దానిని ప్రభుత్వ భూములలో నివసిస్తున్న పేదల పైన ప్రయోగించవచ్చు, భూస్వాముల భూములు ఆక్రమించుకున్న వ్యవసాయకూలీల పైనానీ ఉద్యమాల పైనానీ ప్రయోగించవచ్చు, రిజర్వ్ ఫారెస్టులో సేద్యం చేసే ఆదివాసీల పైన కూడా ప్రయోగించవచ్చు. బలవంతపు డబ్బుల వసూలు అనేది కూడా ఉద్యమాల పైన ప్రయోగిస్తున్న అభియోగమే. అసలే పేదలపైన, ప్రజాఉద్యమాల పైన నిర్బంధం విపరీతంగా పెరుగుతున్న ఈ తరుణంలో ఈ రకమైన దుర్వినియోగానికి ఆస్కారం ఉన్న చట్టాన్ని ఆమోదించడం విజ్ఞత అనిపించుకుంటుందా?

ప్రజలకు కొన్ని కనీస హక్కులు కల్పించే సీలింగ్ చట్టాలనూ కార్మిక చట్టాలనూ సంక్షేమ విధానాలనూ పాలకులు ఒక పక్క బలహీన పరుస్తున్నారు. ఇంకొక పక్క చట్టం రూపంలోనే నిర్బంధ అధికారాలు పెంచుకొంటున్నారు. ఏదో ఒక అవసరాన్ని చూపించి పెంచుకున్నప్పటికీ ఆ అధికారాలు సూత్రప్రాయంగా అప్రజాస్వామికమైనవనీ, సామాన్య ప్రజలపైనే వాటిని ఎక్కువగా ప్రయోగించే ప్రమాదం ఉందనీ గుర్తించడం అవసరం.

అందుకే ఈ కొత్త నిర్బంధ చట్టం ఇంకా జారీ కాక ముందే దానిని వ్యతిరేకించి, అది జారీ కాకుండా అడ్డుకుందాం రమ్మని ప్రజలకు పిలుపు ఇస్తున్నాం.

**ప్రజాస్వామ్యహక్కుల పరిరక్షణ సంస్థ (OPDR), మానవహక్కుల వేదిక (HRF)**

**15.02.2001**